
ఇంటర్ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌కు జగ్గారెడ్డి అభినందన



ఇంటర్‌లో రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించిన మెహ్రీన్ సుల్తానాను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 1 : సంగారెడ్డి రాయల్ కాలేజ్ విద్యార్థిని మెహ్రీన్ సుల్తానా ఇంటర్మీడియట్‌లో రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు సాధించడం పట్ల సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అభినందించారు. ఇంటర్మీడియట్‌లో విద్యార్థి సుల్తానా 993 మార్కులు తెచ్చుకుని సంగారెడ్డికే గర్వకారణంగా నిలిచారని ఆయన అన్నారు. అయితే తదుపరి చదువుల కోసం ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయని తెలుపడంతో సుల్తానాకు రూ.3 లక్షలు సమకూరుస్తానని జగ్గారెడ్డి హామీ ఇచ్చారు. జగ్గారెడ్డిని కలిసిన వారిలో విద్యార్థిని మెహ్రీన్ సుల్తానా ఆమె తండ్రి సుజాయత్ అలీ, రాయల్ కాలేజ్ ప్రిన్సిపాల్ కృపానిధి, యువజన కాంగ్రెస్ నాయకుడు కూన సంతోష్ ఉన్నారు.

నేడు సిద్దిపేటకు సీఎం రేవంత్‌రెడ్డి

- పట్టణంలో రోడ్‌షో, అంబేడ్కర్ సర్కిల్ వద్ద పబ్లిక్ మీటింగ్
- భారీ బందోబస్తు ఏర్పాటు
- అధికారులకు, సిబ్బందికి సీపీ అనురాధ దిశానిర్దేశం

సిద్దిపేట క్రైం, మే 1: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేట పట్టణానికి రానున్నారు. ముందుగా పట్టణంలోని బీజేఆర్ చౌరస్తా నుంచి రోడ్‌షో చేపట్టనున్నారు. అనంతరం సిద్దిపేట పాత బస్టాండ్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద పబ్లిక్ మీటింగ్‌లో ఆయన



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

పాల్గొననున్నారు. ఈ మేరకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ హెలీప్యాడ్, రోడ్‌షో, పబ్లిక్ కార్నర్ మీటింగ్, వాహనాల పార్కింగ్, వీఐపీ రూట్‌మ్యాప్ తదితర ప్రదేశాలను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి బందోబస్తు సంబంధించి దిశానిర్దేశం చేశారు. ట్రాఫిక్, పార్కింగ్ వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్‌షోకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకూడదన్నారు. బందోబస్తుకొచ్చిన అధికారులు, సిబ్బంది రోడ్‌షో, సభ పూర్తయి ప్రజలందరూ వెళ్లిన తర్వాతనే వెళ్లాలని స్పష్టం చేశారు.

పార్కింగ్ అక్కడే..

మీటింగ్ వచ్చే వారు తమ వాహనాలను బాలాగౌడ్ ఫంక్షన్‌హాల్, ఎన్సాన్‌పల్లి ఎక్స్ రోడ్డు, వేములవాడ కమాన్ ఎదురుగా ఉన్న గ్రౌండ్, రంగధాంపల్లిచౌరస్తా పక్కన్న ఉన్న గ్రౌండ్‌లో పార్క్ చేసి పాత బస్టాండ్ ఆవరణకు రావాలని సీపీ తెలిపారు. సిద్దిపేట పట్టణంలోకి వచ్చే వాహనాలు ముస్తాబాద్ చౌరస్తా, నర్సాపూర్ క్రాస్ రోడ్డు, విపంచి ఎల్ఐసీ ఆఫీస్ రోడ్డు, రంగధాపల్లి చౌరస్తా నుంచి డైవర్షన్ తీసుకోవాలని సీపీ సూచించారు.

45.9°



దూళిమిట్టలో గరిష్ఠ ఉష్ణోగ్రత

ఈ ఏడాది ఇదే అత్యధికం

- సిద్దిపేట జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ
- ఉమ్మడి జిల్లాలో 43 నుంచి 45 డిగ్రీలు నమోదు
- భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి
- ఆరెంజ్ అలర్ట్‌లో సంగారెడ్డి, మెదక్ జిల్లాలు

సదాశివపేట 44.6

చేగుంటలో 43.5

మెదక్ అర్బన్, మే 1: ఉమ్మడి మెదక్ జిల్లాలో భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఉదయం నుంచి ఎండలు మండుతుండడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు రికార్డుస్థాయికి పెరుగుతున్నాయి. ఎండలకు తోడు వడగాలులు వీస్తుండడంతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల 43 నుంచి 45 డిగ్రీలకు పైగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సిద్దిపేట జిల్లా దూళిమిట్టలో గరిష్ఠంగా 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఏడాది నమోదైన ఉష్ణోగ్రతల్లో ఇదే అత్యధికం. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో 44.6 డిగ్రీలు, మెదక్ జిల్లా చేగుంటలో 43.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణశాఖ సిద్దిపేట జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేయగా, సంగారెడ్డి, మెదక్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మధ్యాహ్న సమయంలో ఉమ్మడి జిల్లాలోని ముఖ్య కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు బోసిపోతున్నాయి. రాత్రి 10 దాటినా వేడి తగ్గడం లేదు. రాత్రిపూట వేడి వాతావరణం నెలకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గరిష్ఠ ఉష్ణోగ్రతలిలా...

సిద్దిపేట జిల్లాలో

దూళిమిట్టలో అత్యధికంగా 45.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా... చిట్యాల 45.4, లక్డారం 45.1, రేంబర్తి 44.8, సిద్దిపేట 44.6, తుక్కాపూర్ 44.3, అంగడికిష్టాపూర్ 43.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైంది.

సంగారెడ్డి జిల్లాలో

సదాశివపేట 44.6, కొండాపూర్ 44.1, కల్హేర్‌లో 44.0, కిష్టారెడ్డిపేట 43.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లాలో

చేగుంట 43.5, పాతూర్ 43.4, కౌడిపల్లి 43.2, రేగోడ్ 43.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

గడప దాటలేక.. ఉక్కపోత తట్టుకోలేక

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలు నిప్పులకుంపటిగా తయారయ్యాయి. ఇంట్లో ఉన్నా ఎండ వేడిమికి ఉక్కపోతను భరించలేకపోతున్నారు. ఫ్యాన్ కింద కూర్చున్నా ఉపశమనం లభించడం లేదు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అసలు బయటకు వెళ్లలేని పరిస్థితి. ఈ సమయంలో గాలిలో తేమ శాతం తగ్గి ఉక్కపోత పెరుగుతోంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.




టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లిలో చెట్టు నీడన సేద తీరుతున్న మేకల మంద

జాగ్రత్తలు పాటించాలి

తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్లే వారు రక్షణ చర్యల్ని తీసుకోవాలి. ముఖ్యంగా పిల్లల విషయంలో జాగ్రత్త. వృద్ధులు, చిన్నారులు, క్రీడాకారులు, గర్భిణులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధులు, స్థూలకాయం ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి.

- డా.శివదయాల్, సివిల్ సర్జన్

ఇంకా 10 రోజులే



- లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల దూకుడు
- బీఆర్‌ఎస్‌లో అన్నీతానైన హరీశ్‌రావు
- సుడిగాలిలా పర్యటిస్తున్న వెంకట్రామారెడ్డి
- ప్రచారంలో పట్టువదలని రఘునందన్
- కాంగ్రెస్‌లో జోష్ నింపేందుకు నేడు సిద్దిపేటకు రేవంత్
- ప్రచారంపై ఎండల ప్రభావం!

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మే1: నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగియడంతో అభ్యర్థుల ప్రచారం ఒక్కసారిగా ఉధృతమైంది. ప్రచారానికి ఇంకా పదిరోజులే మిగలడంతో అభ్యర్థులు హోరాహోరీగా పర్యటిస్తున్నారు. ఓ వైపు ఎండలు మండుతున్నప్పటికీ సమయం తక్కువగా ఉండడంతో ప్రచారంపైనే దృష్టిసారిస్తున్నారు. ప్రత్యక్షంగా ప్రజలను కలుస్తూ తమను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి కంచుకోటగా ఉన్న మెదక్ పార్లమెంట్ స్థానంలో పాగా వేయాలని ఇటు బీజేపీ అటు కాంగ్రెస్ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. అయితే తమ స్థానాన్ని పదిలంగా ఉంచుకోవడానికి బీఆర్‌ఎస్ సైతం సర్వత్రా ముందుకెళ్తోంది. ఒకరికి స్థానికంగా బలం ఉండగా, మరో ఇద్దరికి కేంద్రంలో, రాష్ట్రంలో అధికారమే బలమైంది. ఆ ధీమాతోనే ఎవరికివారు ప్రచారంలో దూకుడు పెంచుతున్నారు.

వెంకట్రామారెడ్డి వెన్నంటే హరీశ్..

బీఆర్‌ఎస్ అభ్యర్థిగా వెంకట్రామారెడ్డిని ప్రకటించిన క్షణం నుంచి ఇప్పటిదాకా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆయన వెన్నంటే ఉంటున్నారు. మెదక్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని హరీశ్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతికూల పరిస్థితి ఎదురుకావడంతో మునుపటి జోష్‌ను రేకెత్తించేలా విజయం కోసం ప్రయత్నిస్తున్నారు. మెదక్ లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఆరింట్లోనూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే ఉండడం ఆ పార్టీకి లాభించే విషయంగా భావిస్తున్నారు. ఈ ప్రాంతంపై పూర్తిగా పట్టున్న హరీశ్‌రావు తనదైన శైలిలో ప్రణాళిక సిద్ధం చేయడంతో వెంకట్రామారెడ్డి ప్రచారం సులభతరమవుతోంది. అంతేగాకుండా మండల కేంద్రాల్లో రోడ్‌షోలు, ఉదయం వేళలో మార్నింగ్ వాక్ కార్యక్రమాలు, మధ్యాహ్న సమయాల్లో పలు వర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ ముందుకెళ్తున్నారు. జనసమీకరణకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈనెల 10న సిద్దిపేటలో కేసీఆర్ హాజరయ్యే సభకు పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించాలని కసరత్తు చేస్తున్నారు.

రఘునందన్‌రావు విస్తృతంగా...

గత పార్లమెంటు ఎన్నికల్లోనూ ఎంపీగా పోటీచేసి ఓడిపోయిన బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు సైతం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. లోక్‌సభ నియోజకవర్గంపై పూర్తిగా పట్టున్న నేపథ్యంలో ప్రణాళిక బద్ధమైన ప్రచారం చేస్తున్నారు. తాను అభ్యర్థిగా ఎంపికైన నాటి నుంచి ఒక షెడ్యూల్ ప్రకారం సమావేశాలు, రోడ్‌షోలు, అంతర్గత మీటింగ్‌లు, కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. మెదక్‌లో తన నామినేషన్ కార్యక్రమానికి గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌ను తీసుకొచ్చారు. ఇటీవల సిద్దిపేటలో అమిత్‌షాతో బహిరంగ సభ నిర్వహింపజేశారు. తాజాగా అల్లాదుర్గంలో ప్రధాని మోదీ సభకు మెదక్ లోక్‌సభ కార్యకర్తలు, ప్రజలను తరలించారు. వీటితోపాటు క్షేత్రస్థాయిలో కాషాయదళాన్ని అప్రమత్తం చేస్తున్నారు. ఇంటింటి ప్రచారం నిర్వహించేలా వెంటపడుతున్నారు. తాను కూడా ఈ కాస్త సమయాన్ని వినియోగించుకునేలా దృష్టి పెట్టినట్లుగా తెలుస్తోంది. ఈ ఒక్కసారితనకు అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు. కేంద్రంలోని మోదీ చరిష్మా తనకు కలిసి వస్తుందని భావిస్తున్నారు.

ప్రచారంపై 'భానుడి' ఎఫెక్ట్..

ఎన్నికల ప్రచారానికి ఇంకా పదిరోజులు మాత్రమే మిగిలి ఉంది. ఈనెల 13న పోలింగ్ జరుగుతున్న క్రమంలో ఒక రోజు ముందుగా అంటే 11న సాయంత్రం 5గంటల వరకే ప్రచారం ముగించాలి. ఈ కాస్త సమయాన్ని సద్వినియోగం చేసుకుందామంటే ఓ వైపు ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో తెల్లవారుజామున్నే ప్రచారానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బుధవారం రోజున సిద్దిపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి ఉదయం 6గంటలకే మార్నింగ్ వాక్ పేరిట ప్రజలను కలిశారు. ఆ తర్వాత 8గంటల లోపు పలు వీధుల్లో ఇంటింటా పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. 9గంటల తర్వాత అంతర్గత సమావేశాలు నిర్వహించి.. రాత్రి 6గంటల తర్వాత మళ్లీ రోడ్‌షోల్లో పాల్గొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు సైతం ఇదే విధమైన ప్రచారం చేస్తున్నారు. గ్రామగ్రామాన పర్యటించడం సాధ్యపడకపోవడంతో ఉన్న సమయంలోనే ఎక్కువ ప్రచారం చేయాలనే విధంగా ముందుకెళ్తున్నారు.

రేవంత్‌పైనే కాంగ్రెస్ అభ్యర్థి ఆశలు..

ప్రచారంలో బీఆర్‌ఎస్, బీజేపీతో పోల్చితే కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నెమ్మదిగా పుంజుకుంటున్నారు. క్షేత్రస్థాయి ప్రచారంలో ఇప్పుడిప్పుడే నిమగ్నమయ్యారు. మెదక్‌లో ఒకసారి రేవంత్‌రెడ్డి రోడ్‌షోను నిర్వహించగా ఆ ఉత్సాహాన్ని కాపాడుకోలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. తాజాగా నేడు సిద్దిపేటలో రేవంత్‌రెడ్డి రోడ్‌షో జరగనున్నది. మెదక్ పార్లమెంటు పరిధిలో రేవంత్‌ది ఇదే చివరి సభ అయ్యే అవకాశం కూడా లేకపోలేదు. కనీసం ఇప్పుడైనా రేవంత్ క్రేజ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా శ్రమించాలని ఆ పార్టీ నేతలే అంటున్నారు. దీనికితోడు పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తుల గళం వినిపిస్తోంది. ఎంపీ అభ్యర్థి తమను పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పలుచోట్లా నీలం మధుకు సొంత పార్టీలోనే ఆశించిన మద్దతు దక్కడం లేదనే అభిప్రాయాలున్నాయి. ఇటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి చరిష్మాతో పాటు తన బీసీ కార్డును ఉపయోగిస్తూ పలు సమావేశాల్లో మాట్లాడుతున్నారు. ప్రధానంగా బీఆర్‌ఎస్‌కు కంచుకోటలుగా ఉన్న సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పట్టుకోసం ప్రయత్నిస్తున్నా సత్ఫలితాలు రావడం లేదనే చర్చ జరుగుతోంది.

మచ్చలేని వ్యక్తి వెంకట్రామారెడ్డి

- రఘునందన్‌రావుది అబద్ధపు, గ్లోబెల్ ప్రచారాలు
- దమ్ముంటే ఫేయిర్ పాలిటిక్స్ చేయాలి
- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిపై ఫేక్ వీడియోలు
- ఈసీకి, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేటలోని నెక్లెస్ రోడ్డు వద్ద హరీశ్‌రావు, వెంకట్రామారెడ్డిని సన్మానించిన వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, మే1: తెల్లని పేపర్‌లాగా, ఎలాంటి మచ్చలేని వ్యక్తి ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామారెడ్డి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. బుధవారం సిద్దిపేటలో బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామారెడ్డిని గెలిపించాలంటూ ఆయనతో కలిసి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభూత కల్పనలు, అబద్ధపు ప్రచారాలు చేస్తూ రాజకీయంగా లబ్ధి పొందేందుకు రఘునందన్‌రావు చూస్తున్నారన్నారు. గతంలో కూడా ఇతర పార్టీకి చెందిన నాయకుడిపై ఫేక్ వీడియో సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారాలు చేస్తూ లబ్ధి పొందారని తెలిపారు. అదే తరహాలో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. రఘునందన్‌రావుకు దమ్ముంటే ఫేయిర్ పాలిటిక్స్ చేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి ప్రజలు అడుగడుగున నీరాజనం పలుకుతున్నారని, అది సహించలేకే సోషల్ మీడియాలో, ఫేక్ వార్తలను సృష్టించి రాజకీయ లబ్ధి పొందేందుకు రఘునందన్‌రావు, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ చేసే కుట్రలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన స్పష్టం చేశారు. అందరూ ఆస్తులు సంపాదించుకోవాలనుకుంటే, వెంకట్రామారెడ్డి మాత్రం తన ఆస్తి పంచి పెడుతున్నారని, అందుకే పీవీఆర్ ట్రస్టు పేరిట పార్లమెంట్ నియోజకవర్గాల విద్యార్థులు, యువతకు మంచి చేయాలని చూస్తున్నారని వివరించారు. అందరిలాగా డబ్బుకు విలువ ఇవ్వకుండా కేవలం ప్రజలకు సేవ చేయడానికి వచ్చారని తెలిపారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుపై ఎలక్షన్ కమిషన్‌తో పాటు పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెడతామని హెచ్చరించారు.



మినీ స్టేడియంలో క్రికెట్ ఆడుతున్న హరీశ్‌రావు

వాకర్స్, క్రీడాకారులతో కాసేపు సరదాగా..

సిద్దిపేటలోని కోమటిచెరువు, నెక్లెస్ రోడ్డులో సిద్దిపేట వాకర్స్ అసోసియేషన్‌తో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి కాసేపు వ్యాయామం చేశారు. అనంతరం మినీ స్టేడియంలో క్రికెట్ క్రీడాకారులతో కలిసి కాసేపు క్రికెట్ ఆడారు. ఆ తర్వాత పట్టణంలో కాంచిట్ చౌరస్తాలో అల్లం చాయ్ తాగుతూ అక్కడున్న వారితో మాట్లాడారు. సిద్దిపేట ప్రజలే తన కుటుంబ సభ్యులుగా భావిస్తానని, అందరితో ఇలాంటి ఆత్మీయ కలయిక గొప్ప సందర్భమని హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నాయకులు రాజనర్సు, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, పాల సాయిరాం, కౌన్సిలర్లు కలకుంట్ల మల్లికార్జున్, సాయిఈశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- ఓటు హక్కు వినియోగించుకోనున్న 14 వేల మంది..
- ఆర్డీవో కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు
- ఎన్నికల అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మే 1: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ హక్కును ఎన్నికల సంఘం కల్పించిందని, ఈ నెల 4 నుంచి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ కొనసాగనున్నదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్‌ల కేటాయింపును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియను నిర్వహించాలన్నారు. ఏడు సెగ్మెంట్లలో ఆయా ఆర్డీవో కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న 14 వేల మంది ఓటింగ్‌లో పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఆదివారం కూడా ఫెసిలిటేషన్ సెంటర్లు పనిచేస్తాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



ఈవీఎం గోదాముకు అదనపు బ్యాలెట్ యూనిట్లు

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అదనపు బ్యాలెట్ యూనిట్లు మంగళవారం రాత్రి మెదక్ జిల్లా కేంద్రంలోని గోదాముకు చేరుకున్నాయి. మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి 44 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున పోలింగ్ నిర్వహణ కోసం మూడు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేయాల్సి వస్తుంది. దాంతో ఎన్నికల సంఘం మెదక్ పార్లమెంట్‌కు ఈసీఐఎల్ నుంచి 1100 అదనంగా బ్యాలెట్ యూనిట్లను కేటాయించింది.

మొదటి దశ పరిశీలన పూర్తి

అదనంగా కేటాయించిన బ్యాలెట్ యూనిట్లకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ ఈసీఐఎల్ ఇంజనీర్లతో బ్యాలెట్ యూనిట్ల మొదటి దశ పరిశీలన(ఎఫ్ఎల్‌సీ)ని చేపట్టారు. ర్యాండమైజేషన్ నిర్వహించిన మీదట బ్యాలెట్ యూనిట్లను జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలకు కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



రాంగొండ(ఫైల్), బస్వరాజ్(ఫైల్)

మనూరు, మే 1: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందిన సంఘటన కర్ణాటకలోని బీదర్‌లో బుధవారం జరిగింది. మనూరు మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ రాంగొండ(60), నాగల్‌గిద్ద మండలం పూసల్‌పాడ్ గ్రామానికి చెందిన బస్వరాజ్(56) పనుల నిమిత్తం బుధవారం ఉదయం బీదర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. పనులు ముగించుకొని సాయంత్రం తిరిగి వస్తుండగా బీదర్ సమీపంలో కారు ఢీకొనడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఝరాసంగం, మే 1: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని పోట్‌పల్లి గ్రామంలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన ఉప్పరి పాండు(22) మోటారు సహాయంతో ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసుకున్న సంపు నుంచి నీటిని తీస్తున్నాడు. ఈ క్రమంలో షాక్‌కు గురయ్యాడు. చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు వెంటనే జహీరాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు వారు పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రాష్ట్రస్థాయి అవార్డు



హైదరాబాద్‌లో సర్టిఫికెట్లను అందుకున్న అధ్యాపకులు, విద్యార్థులు

జహీరాబాద్, మే 1: జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కంప్యూటర్ సైన్స్‌లో రాష్ట్రంలో మూడో స్థాయి అవార్డు వచ్చిందని ప్రిన్సిపాల్ అస్లాంఫారుఖీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ విద్యాశాఖ కమిషనర్ అధ్యయనం ప్రకారం.. కంప్యూటర్ సైన్స్‌లో క్యూఆర్ కోడ్ తయారీ అంశంపై నిర్వహించిన పరిశోధన ప్రాజెక్టులో తాము రాష్ట్రంలో మూడోస్థానాన్ని సాధించామన్నారు. హైదరాబాద్‌లోని సంస్కృతిహాల్‌లో బుధవారం రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించగా.. విద్యార్థుల ప్రదర్శనకు మూడో ర్యాంకును అందజేశారని పేర్కొన్నారు. అందులో భాగంగా ప్రాజెక్టులో ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలను సులభతరం చేయడానికిగాను పైథాన్ క్యూఆర్ కోడ్‌లను ఏవిధంగా అభివృద్ధి చేయొచ్చో విద్యార్థులు వివరించారు. ప్రతియేటా రాష్ట్రవ్యాప్తంగా అన్ని విషయాలపై ప్రాజెక్టులను నిర్వహించేందుకు రాష్ట్ర విద్యాశాఖ ఆహ్వానిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బి.వెంకటేశం, కళాశాల విద్యాశాఖ కమిషనర్ అయేషా బతుల్‌తర్నం, రాష్ట్రస్థాయి అధికారులు సంగీతప్రియాంక, యశ్వంత్‌రాథోడ్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు



విలేకరులతో మాట్లాడుతున్న చేవెళ్ల ఏసీపీ బంటు కిషన్

చేవెళ్ల, మే 1: బాలికపై అత్యాచారానికి పాల్పడి, మోసం చేసిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు, రూ.40 వేల జరిమానా విధిస్తూ ఎల్బీనగర్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి హరిష బుధవారం తీర్పునిచ్చారు. చేవెళ్ల ఏసీపీ బంటు కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. 2017లో చేవెళ్లలో నివాసముంటున్న బాలికను సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన రత్నం అలియాస్ కిరణ్(34) ఫోన్ ద్వారా పరిచయం చేసుకున్నాడు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి యాదగిరిగుట్టకు తీసుకెళ్లాడు. అక్కడ గదిని అద్దెకు తీసుకుని అత్యాచారం చేశాడు. కొన్నిరోజుల తర్వాత బాలిక గర్భం దాల్చింది. ఆ తర్వాత వివాహం చేసుకోనని కిరణ్ బాలికను మోసం చేశాడు. దీంతో బాలిక కుటుంబసభ్యులు చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో 22 ఫిబ్రవరి 2017లో అప్పటి సీఐ గురువయ్యగౌడ్ కేసు నమోదు చేశాడు. కోర్టులో వాదనలు విన్న న్యాయాధికారి నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల జైలు, రూ.40 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారని ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో 30 యాక్ట్: ఎస్పీ

మెదక్ అర్బన్, మే 1: జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని మే 31 వరకు నెలరోజులపాటు మెదక్ జిల్లావ్యాప్తంగా 30, 30(ఏ) పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ డా. బాలస్వామి ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సమావేశాలు నిర్వహించొద్దన్నారు. ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు సహకరించాలని ఆయన కోరారు.

కోలపల్లి చెక్‌పోస్టు వద్ద రూ.1.10 లక్షలు పట్టివేత



నగదు స్వాధీనం చేసుకుంటున్న పేట ఎస్ఐ శంకర్, పోలీసు సిబ్బంది

పెద్దశంకరంపేట, మే 1: 161వ జాతీయ రహదారి పెద్దశంకరంపేట మండల పరిధిలోని కోలపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు మహారాష్ట్ర- నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న హరిప్రీత్‌సింగ్ వాహనంలో రూ.1.10 లక్షలను ఎస్ఐ శంకర్, పోలీస్ సిబ్బంది పట్టుకున్నారు. డబ్బుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని సంగారెడ్డి గ్రీవెన్స్ కమిటీకి అప్పగించనున్నట్లు పోలీసు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు

జహీరాబాద్, మే 1: జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి, సెక్టోరియల్ అధికారులకు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఎన్నికల నిర్వహణ సమయంలో పాటించాల్సిన విధివిధానాల గురించి వివరించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం చేస్తే అందరు ఇబ్బందుల్లో పడుతారనే విషయాన్ని గమనించాలన్నారు. సందేహాలేమైన ఉంటే ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

సిద్దిపేటను అవమానించిన సీఎం రేవంత్

- ఈ ఎన్నిక తెలంగాణ భవిష్యత్ కోసం జరిగే ఎన్నిక
- రైతుబంధు, రైతుబీమా పథకాలతో కేసీఆర్ రైతుల గౌరవం పెంచారు
- అబద్ధాల కాంగ్రెస్‌కు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలి
- చిన్నకోడూరు రోడ్‌షోలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



రోడ్‌షోకు హాజరైన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు



రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి

చిన్నకోడూరు, మే 1: సిద్దిపేట అంటే సీఎం రేవంత్‌రెడ్డికి మొదటి నుంచి చిన్న చూపేనని, తెలంగాణ తెచ్చింది మన సిద్దిపేట బిడ్డ కేసీఆర్ అని, అలాంటి కేసీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టారీతిన తిడుతున్నాడని, కేసీఆర్‌ను తిట్టడం అంటే మన సిద్దిపేట ప్రజలను అవమాన పర్చినట్లేనని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. బుధవారం రాత్రి సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో నిర్వహించిన రోడ్‌షోలో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మతో కలిసి పాల్గొన్నారు. స్థానిక ఎల్లమ్మ ఆలయం నుంచి వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. ఈనెల 13న జరిగే ఎన్నిక ఓట్లు, సీట్లు, అధికారం కోసం జరిగేది కాదని తెలంగాణ భవిష్యత్ కోసం జరిగే ఎన్నిక అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డివి అయితే తిట్లు లేకపోతే దేవుని మీద ఒట్లు అని విమర్శించారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు ప్రజలు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, రైతుబీమా పథకాలు ప్రవేశపెట్టి అమలుచేసి రైతుల గౌరవం పెంచాడని తెలిపారు. కల్లాలకు ధాన్యం వచ్చినా.. రైతు ఖాతాల్లో రైతుబంధు పడలేదని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి రెండురోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నా వడ్లు కొనే దిక్కులేదని ఆరోపించారు. పొరపాటున బీజేపీకి ఓటు వేస్తే 'పెనం మీద నుంచి వెళ్లి పొయ్యిల పడ్డట్టేనని' ప్రజలకు సూచించారు. బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ.. పేదింటి విద్యార్థుల చదువుల కోసం రూ.100 కోట్లతో పీవీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. పోటీ పరీక్షల కోసం సిద్దిపేటలో ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తానని హామీఇచ్చారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి తనను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. అంతకుముందు కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఇచ్చిన హామీలను హరీశ్‌రావు ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాపయ్య, పీఏసీఎస్ చైర్మన్లు సదానందం, కనకరాజు, ఎంపీటీసీలు, తాజా, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పతి కోసం సతి ప్రచారం

- ఓటర్లను కలుస్తూ.. గెలిపించాలని కోరుతూ..
- ఇంటింటి ప్రచారంలో వెంకట్రామారెడ్డి సతీమణి



తన భర్తను గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి సతీమణి ప్రణతిరెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, మే 1: పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి తన భర్త వెంకట్రామారెడ్డిని గెలిపించాలంటూ ఆయన సతీమణి ప్రణతిరెడ్డి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. బుధవారం జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలోని 11, 18వ వార్డుల్లో స్థానిక నేతలతో కలిసి ఓటర్ల వద్దకు వెళ్లారు. గతంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్‌గా ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సుపరిచితుడని ఓటర్లకు గుర్తుచేశారు. బీఆర్ఎస్ పదేళ్లలో అమలుచేసిన సంక్షేమ పథకాలు, ప్రభుత్వ తీరును చూసి ఓటు వేయాలని కోరారు. తన భర్తను గెలిపిస్తే.. రూ.100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేయబోతున్నామని, అంతేకాకుండా ఉచితంగా ఒక్క రూపాయికే వివాహాలు జరుపుకునేందుకు ఫంక్షన్‌హాళ్లు నిర్మిస్తామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీల అమలుతీరుపై ఓటు అడిగేందుకు వచ్చే నాయకులను ప్రశ్నించాలన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు రైతు రుణమాఫీ, రైతుబంధు లక్ష్యాలను చేరుకోలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలనే ఇప్పటికీ పూర్తిచేయని కాంగ్రెస్‌కు, ఎటువంటి సిద్ధాంతం లేని బీజేపీకి ఓటు అడిగే హక్కు లేదన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి కావాలంటే కారు గుర్తుకే ఓటు వేసి తన భర్తను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట కుమారుడు భరత్‌రాజ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు ఆర్‌కె శ్రీనివాస్, ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, మామిళ్ల ఆంజనేయులు, సులోచనాప్రభురెడ్డి, లలిత ఉన్నారు.



జగదేవ్‌పూర్: మునిగడప గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వెంకట్రామారెడ్డి కోడలు శాలినిరెడ్డి

మామ కోసం కోడలు ప్రచారం

జగదేవ్‌పూర్, మే 1: బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా తన కోడలు శాలినిరెడ్డి బుధవారం మండలంలోని మునిగడప గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్తూ మహిళలను కలిసి కారు గుర్తుకు ఓటేసి వెంకట్రామారెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కవిత, శ్రీనివాస్‌రెడ్డి, కావ్య, దుర్గయ్య, మాజీ సర్పంచ్ బాలలక్ష్మి, నాయకులు నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు ఓటేస్తే ఫలితం శూన్యం: రఘునందన్‌రావు



ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

నారాయణరావుపేట/సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు, మే 1: పదేళ్ల పాలించిన బీఆర్ఎస్‌కు, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్‌కు ఓటేస్తే ఫలితం శూన్యంగా మారుతుందని బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. బుధవారం నారాయణరావుపేటలో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు, రాఘవాపూర్, పెద్దలింగారెడ్డిపల్లి మీదుగా మండల కేంద్రం వరకు బైక్ ర్యాలీతో కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ర్యాలీ మధ్యలో పెద్దలింగారెడ్డిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు, హమాలీలతో మాట్లాడి ఓట్లను అభ్యర్థించారు. అనంతరం నారాయణరావుపేట మండలంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద రఘునందన్‌రావు మాట్లాడారు. నారాయణరావుపేట పేరుకే మండలంలో ఏర్పడిందని, ఇప్పటివరకు ఎలాంటి ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవన్నారు. మాజీ ఆర్థికమంత్రిగా ఉన్న హరీశ్‌రావు పదేళ్ల కలెక్టర్‌గా పనిచేసిన వెంకట్రామారెడ్డి వెంట తిరగాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే కోమటిచెరువులో, నారాయణరావుపేట పెద్ద చెరువులో వేసినట్లేనన్నారు. అనంతరం మాటిండ్ల గోపులాపూర్, జక్కాపూర్, గుర్రాలగొంది, మల్యాల, మీదుగా రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నాల బాబు, జిల్లా అధికార ప్రతినిధి రమేష్‌గౌడ్, బీజేపీ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. అలాగే చిన్నకోడూరులో బుధవారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోలో రఘునందన్‌రావు పాల్గొని మాట్లాడారు.

ఐఐటీహెచ్‌ను సందర్శించిన జర్మనీ ప్రతినిధుల బృందం

- విజ్ఞాన మార్పిడే లక్ష్యంగా ఉమ్మడి పరిశోధనలు

కంది, మే 1: పరిశోధన రంగాల్లో అనుకూలమైన మార్గాలను అన్వేషించడానికి ఐఐటీ హైదరాబాద్ జర్మనీకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ మాగ్డేబర్గ్ ప్రతినిధుల బృందంతో చేతులు కలిపింది. ఇందులో భాగంగా జర్మనీ ప్రతినిధుల బృందం ఐఐటీ హైదరాబాద్‌ను బుధవారం సందర్శించింది. జర్మనీతో భారతదేశ సంబంధాలను తెలుసుకుని జర్మనీ ప్రతినిధులు ఐఐటీ హైదరాబాద్ అధ్యాపకులను ప్రశంసించారు. రెండు సంస్థల మధ్య విజ్ఞాన మార్పిడే లక్ష్యంగా విద్యాపరమైన ఉమ్మడి పరిశోధనలు చేపట్టనున్నారు. అనంతరం జరిగిన వర్చువల్ సమావేశంలో ఫ్యాకల్టీతో పాటు విద్యార్థుల మార్పిడి, పరస్పర సాంస్కృతిక అభ్యాసం, జర్మన్ విశ్వ విద్యాలయాల మధ్య అధ్యాపకుల అనుభవాలపై ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తితో జర్మనీ ప్రతినిధులు చర్చించారు. జాయింట్ పర్యవేక్షణ, ఉమ్మడి డిగ్రీ ప్రోగ్రామ్‌లు, జాయింట్ సూపర్ విజన్, మెకానిజమ్‌లను ఏర్పాటు చేయడంపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా బీఎస్ మాట్లాడుతూ బయో మెడికల్ ఇంజనీరింగ్, ఏఐ, స్వయం ప్రతిపత్తి నావిగేషన్ సిస్టమ్, భవిష్యత్ టెలికాం టెక్నాలజీ, సెమీకండక్టర్ టెక్నాలజీ వంటి రంగాల్లో ఐఐటీ హైదరాబాద్ ముందంజలో ఉన్నదన్నారు. ఐఐటీ హైదరాబాద్‌కు అంతర్జాతీయ సహకారం లభించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహకారంతో తమ పరిశోధనలు మరింత బలోపేతం అవుతాయని బీఎస్ మూర్తి ఆకాంక్షించారు.



కంది సమీపంలోని ఐఐటీ హైదరాబాద్‌లో జర్మనీ ప్రతినిధుల బృందం

కేంద్రంలో మోదీ గద్దెనెక్కడం ఖాయం

- బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీబీ పాటిల్

టేక్మాల్, మే 1: కేంద్రంలో మూడోసారి మోదీ గద్దెనెక్కడం ఖాయమని బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిధిలోని పల్వంచ గ్రామ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉన్నాయని, తిరిగి ఎన్నికల్లో మోదీనే కోరుకుంటున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గతం నుంచి రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయడంతో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావడం లేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ అసత్య వాగ్దానాలతో ఓటు బ్యాంకు రాజకీయాలు నిర్వహిస్తున్నదని అన్నారు. బీఆర్ఎస్ కుటుంబపాలనకు ప్రజలు చరమగీతం పాడారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు.

విద్యుత్ మీటర్ కోసం ట్యాంక్ ఎక్కి నిరసన



సయ్యద్‌ను కిందికి తీసుకొస్తున్న ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

మనోహరాబాద్, మే 1: విద్యుత్ మీటర్ మంజూరు చేయడం లేదని ఓ వ్యక్తి వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన సయ్యద్ కొద్దిరోజుల క్రితం విద్యుత్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంతో మంజూరు చేయకపోవడంతో బుధవారం సాయంత్రం వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసనకు దిగాడు. మీటర్ తెచ్చి ఇస్తేనే కిందికి దిగుతానని భీష్మించి కూర్చున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ట్యాంక్ పైకి ఎక్కి సయ్యద్‌ను సముదాయించి కిందికి తీసుకొచ్చారు.



సిద్దిపేట అర్బన్: ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలు


హుస్నాబాద్‌లో మేడే వేడుకల్లో మున్సిపల్ కార్మికులు


జగదేవ్‌పూర్: దౌలాపూర్‌లో జెండా ఎగురవేస్తున్న దృశ్యం

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

● జిల్లా వ్యాప్తంగా ప్రపంచ కార్మిక దినోత్సవం ● కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జెండాలను ఎగురవేసిన యూనియన్ల నాయకులు

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్మిక యూనియన్ల ఆధ్వర్యంలో జెండాలను ఎగుర వేశారు. అనంతరం పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను రూపొందించడం ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. చట్టాల పరిరక్షణకు కార్మికవర్గం ఐక్యం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



సిద్దిపేట అర్బన్: బీఎన్ఆర్‌కేఎస్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాణే పరిశ్రమ వద్ద కార్మిక దినోత్సవం

సిద్దిపేట అర్బన్, మే 1: మే డే స్ఫూర్తితో కార్మికుల ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మందా పవన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర నాయకులు గోపాలస్వామి, బీఎన్ఆర్‌కేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం అన్నారు. 138వ మే డే వేడుకల్లో భాగంగా బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో కార్మికులతో ర్యాలీ నిర్వహించి ఎర్ర జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక చట్టాలను పునరుద్ధరించుకోవాలంటే భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికులకు కనీస సౌకర్యాలు, శ్రమకు తగిన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు సిద్దిపేటలో భారీ ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శంకర్, సంపత్, చంద్రం, జనార్దన్, సీఐటీయూ నాయకులు రవికుమార్, శశిధర్, ఐఎఫ్‌టీయూ నాయకులు శ్రీకాంత్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శేషు తదితరులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్:** మేడే సందర్భంగా పట్టణంలోని సీపీఐ కార్యాలయం, అంబేడ్కర్ హమాలీ సంఘం, ఆదర్శ హమాలీ సంఘం, ఎన్టీర్ హమాలీ సంఘం, ఆదర్శ తోపుడు బండ్ల సంఘం, మున్సిపల్ కార్మిక సంఘం, ఎల్ఐసీ కార్యాలయం ఇతర కార్మిక సంఘాల్లో ఎర్రజెండాను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో కార్మిక సంఘాల నాయకులు పున్న రాజమౌళి, సంపత్, వెంకటరాజం, కేడం లింగమూర్తి, అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి, గడిపె మల్లేశ్, పచ్చిమట్ల రవీందర్ గౌడ్, కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, గడిపె సారయ్య, అశోక్, సదాశివరెడ్డి తదితరులున్నారు.

● **గజ్వేల్/గజ్వేల్ టౌన్:** గజ్వేల్ పట్టణంలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీలోని ఏటిగడ్డ కిష్టాపూర్‌లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్లస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకలకు డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి హాజరయ్యారు. వారివెంట హమాలీ కార్మిక సంఘం నాయకులు చంద్రం, కార్మికులు ఉన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాణే బ్రేక్ పరిశ్రమ వద్ద యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భిక్షపతి, సీఐటీయూ కార్యాలయం వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య జెండాను ఎగురవేశారు. అనంతరం మున్సిపల్, కార్ డ్రైవర్స్, డైమండ్ లారీ డ్రైవర్స్, హమాలీ, ఆటో డ్రైవర్స్, గ్రామపంచాయతీ యూనియన్, విద్యుత్, బాలాజీ సెరామిక్స్ వద్ద జరిగిన మేడే ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆయన వెంట సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి, రంగారెడ్డి, రవి, వెంకటాచారి, స్వామి, యాదగిరి, కుమార్, కనకయ్య, రమేశ్ తదితరులున్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన పల్లె పహాడ్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ హాజరయ్యారు. గజ్వేల్ మండల పరిధిలోని రిమ్మనగూడలో నిర్వహించిన మేడే వేడుకల్లో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులకు, కర్షకులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. వెంట మాజీ జడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య, గ్రామకమిటీ అధ్యక్షులు ఉన్నారు.

● **జగదేవ్‌పూర్:** మండలంలోని అన్ని గ్రామాల్లో మేడే ఉత్సవాల సందర్భంగా కార్మిక జెండాలనును ఎగురవేశారు. అయా కార్యక్రమాల్లో నాయకులు బాలయ్య, నాగభూషణం, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

● **తొగుట:** మండలంలోని వివిధ కార్మిక సంఘాల కార్యాలయాల వద్ద మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తుక్కాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ గజ్వేల్ డివిజన్ సహాయ కార్యదర్శి సిరినేని భూపతిరాజు జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, లక్ష్మణ్, మల్లిఖార్జున్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

● **చిన్నకోడూరు:** మండలంలోని పలు గ్రామాల్లో ఆయా కార్మిక సంఘాల నాయకులు జెండాలను ఎగురవేసి మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

● **నారాయణరావుపేట:** సీఐటీయూ అధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో మే డే వేడుకలు నిర్వహించారు. నారాయణరావుపేటలో హమాలీ కార్మిక సంఘం, గ్రామ పంచాయతీ, తాపీమేస్త్రీ సంఘాల ఆధ్వర్యంలో జెండ ఆవిష్కరించి, స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేష్, సీఐటీయూ నాయకులు పోచంపల్లి భిక్షపతి, మహంకాళి నర్సింహులు, గ్రామ పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

● **నంగునూరు:** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో హమాలీ, గ్రామ పంచాయతీ కార్మికులు సీఐటీయూ మండల నాయకులు దేవులపల్లి రాజమౌళి, అనరాజు ఎల్లయ్య ఆధ్వర్యంలో జెండాలను ఎగురవేశారు. ఆయా గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికులు, హమాలీ సంఘం, గ్రామ పంచాయతీ కార్మికులు జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో నంగునూరు మండల కార్మిక సంఘం నాయకులు దేవులపల్లి మల్లయ్య, బడె రాజయ్య, చంద్ర ప్రకాశ్, దాసరి కిషన్, మాజీ ప్రజాప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● **కుకునూరుపల్లి:** మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం గ్రామ అధ్యక్షుడు కాగిత నాగులు ఆధ్వర్యంలో మేడే దినోత్సవం నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఇండ్ల కనకయ్య జెండాను ఎగురవేసి పలువురు కార్మికులను సన్మానించారు. మంగోల్ గ్రామంలో పారిశుధ్య కార్మికులకు మాజీ వార్డు మెంబర్ లగిశెట్టి అనిత మహేందర్ దుస్తులతో పాటు ఆర్థికసాయాన్ని అందజేశారు.

● **చేర్యాల:** చేర్యాలలో సీపీఎం, సీపీఎంలతో పాటు అనుబంధ కార్మికసంఘాల ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక అంగడిబజారు వద్ద ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అందె అశోక్, హమాలీ కార్మికసంఘం వద్ద మార్కెట్ వైస్ చైర్మన్ పుర్మ వెంకటరెడ్డి, పాతబస్టాండ్ వద్ద బీఆర్టీయూ జిల్లా కార్యదర్శి ముస్త్యాల గణేశ్, సీపీఎం కార్యాలయం వద్ద పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, ముస్త్యాలలో మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో జెండాలను ఎగురవేసి, ర్యాలీ చేపట్టారు. అదేవిధంగా కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకుడు నక్కల యాదవరెడ్డి, పోసాన్‌పల్లి, రాంసాగర్ గ్రామంలో తాడూరి రవీందర్ జెండాలను ఆవిష్కరించారు.

● **కొండపాక:** మండలంలోని పలు గ్రామాల్లో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో జెండాలను ఎగరవేశారు. మండలం లోని వెలికట్ట, అంకిరెడ్డిపల్లి, దుద్దెడ, మర్పడగ, సిర్సనగండ్ల, కొండపాక, రవీంద్రనగర్, తిమ్మారెడ్డిపల్లి, దర్గా తదితర గ్రామాల్లో మేడే వేడుకలను నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి అమ్ముల బాల నర్సయ్య సీఐటీయూ నాయకులు బర్మ కొమురయ్య హమాలీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ఎర్రబోయిన కనకయ్య, జాలిగామా ప్రభాకర్, కొమరవెల్లి కనకయ్య, కనకాచారి, రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

● **కోహెడ:** మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ముంజ గోపి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి బొనగిరి శంకర్, మల్లయ్య, చిట్యాల శేఖర్, అంతయ్య, రాజేశం, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రజిని పాల్గొన్నారు.

● **మద్దూరు:** మండలంలో సీపీఎం ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కమిటీ కార్యదర్శి ఆలేటి యాదగిరి మద్దూరులో అమరవీరుల స్థూపం వద్ద జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, ఎండీ షఫీ, కనకయ్య, ఎల్లస్వామి, రమేష్, నరేష్, చక్రపాణి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

● **దౌల్తాబాద్:** మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో వేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని ఇందుప్రియాల్ గ్రామంలో సీఐటీయూ జిల్లా నాయకులు సంబగ బాల్‌రాజు పారిశుధ్య కార్మికులతో జెండా ఎగురవేశారు.


చేర్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు


చిన్నకోడూరులో మేడే వేడుకల్లో కార్మిక నాయకులు


నంగునూరు: జెండా ఎగురవేసిన సీఐటీయూ నాయకులు


మద్దూరులో సీపీఎం ఆధ్వర్యంలో మే డే వేడుకలు

బండిసంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిక


నాయకులకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండిసంజయ్

కోహెడ, మే 1: మండలంలోని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ సమక్షంలో బుధవారం బీజేపీలో చేరారు. కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో వింజపల్లి ఎంపీటీసీ ద్యాగటి సురేందర్, తంగెళ్లపల్లి వేణుగోపాస్వామి దేవస్థానం చైర్మన్ బీఆర్ఎస్ నాయకుడు ముప్పిడి శ్రీనివాసరెడ్డి, అన్నాడి లక్ష్మారెడ్డి, శనిగరం, గుండారెడ్డిపల్లి, తంగెళ్లపల్లి, వింజపల్లి, తీగలకుంటపల్లి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు ఉన్నారు.


కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు సతీమణి రేఖతో పాటు కుమార్తె, కుటుంబ సభ్యులు కోహెడలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చేతిగుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తీగలగుంట పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

- కోహెడ, మే 1

హామీలు అమలు చేయని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

కొండపాక, మే 1: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా మండలంలోని మర్పడగ, ఖమ్మంపల్లి, రాంపల్లి, కొండపాక గ్రామాల్లో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సందర్భంగా నాయకులు ప్రజలకు కాంగ్రెస్‌పార్టీ వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్, జైపాల్ రెడ్డి, దుర్గయ్య, ఖమ్మంపల్లి , ఎంపీటీసీ యాదగిరి, బొద్దుల తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి

● మద్దూరు మండల సర్వసభ్య సమావేశం


సభలో మాట్లాడుతున్న జడ్పీటీసీ

మద్దూరు, మే 1: భూగర్భజలాలు అడుగంటిపోతున్న నేపథ్యంలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. లద్నూరు, కొండాపూర్‌తో పాటు పరిసర తండాల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులున్నాయని, మిషన్‌భగీరథ నీళ్లు సరిగ్గా రావడం లేదని ఎంపీటీసీలు తెలిపారు. లోవోల్టేజి సమస్యలపై విద్యుత్ శాఖాధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. లద్నూరులో నాగరాజు అనే లైన్‌మెన్ విద్యుత్ పోల్‌పై కనెక్షన్ ఇచ్చినందుకు రూ.1500 వసూలు చేయడంపై ఎంపీటీసీ సమ్మయ్య అధికారుల దృష్టికి వచ్చారు. సదరు లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ, జడ్పీటీసీ సూచించారు. యునానీ ఆస్పత్రిని వెంటనే గ్రామంలోని పంచాయతీ కార్యాలయానికి మార్చాలని జడ్పీటీసీ అధికారులకు సూచించారు. హెల్త్ సబ్‌సెంటర్లు 6మంజూరయ్యాయని, వివిధ దశలో పనులు కొనసాగుతున్నట్లు పీఆర్ ఏఈ వినయ్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యానికి కాంటా పెట్టగానే రశీదులు అందించాలని, రైస్ మిల్లర్లు ధాన్యాన్ని దించుకున్నాక కోత విధిస్తున్నట్లు చెప్పడం సరికాదన్నారు. దీనిపై సీసీలు బాధ్యత తీసుకుని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జడ్పీటీసీ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంమోహన్, తహసీల్దారు అనంతరెడ్డి, దూళిమిట్ట స్పెషలాఫీసర్ సీతారాం, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థికి మద్దతుగా గ్రామాల్లో ప్రచారం


వర్గల్: వేలూర్‌లో ప్రచారం చేస్తున్న నందన్‌గౌడ్

వర్గల్, మే 1: రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదిగిందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పూదరి నందన్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావుకు మద్దతుగా మండలంలోని వర్గల్, వేలూర్, గౌరారం, నాచారం గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహిస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. రాష్ట్రంలో బీజేపీ బలపడుతుండటంతో మిగతా పార్టీలకు వణుకు పుడుతుందన్నారు.ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి హామీలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి, నాయకులు యాదగిరి, పంజాల వెంకట్ గౌడ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

● **దౌల్తాబాద్:** మండలంలోని తిర్మలాపూర్‌లో ఉపాధి హామీ కూలీ పనుల వద్ద మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందరావుకు మద్దతుగా దౌల్తాబాద్ బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు సర్వగారి భూపాల్‌రెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి బీజేపీని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి ముత్యాల శ్రీనివాస్, కొండయ్య, భాను, ప్రసాద్, శివంది శ్రీనివాస్, ఎల్లం, గడ్డం స్వామి, బగ్గిరాజు, సురేష్ పాల్గొన్నారు.

● **రాయపోల్:** రఘునందన్‌రావును విమర్శించే అర్హత మాజీ మంత్రి హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిలకు లేదని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు రాజాగౌడ్, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఎస్సీ మోర్చా ఇన్‌చార్జి మంకిడి స్వామి, వైస్ ఎంపీపీ రాజిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ మంగళవారం రాత్రి రాయపోల్‌లో జరిగిన రోడ్‌షోలో బీఆర్ఎస్ నాయకులు రఘునందన్‌రావుపై అనుచితమైన వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. సమావేశంలో బీజేపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, నాయకులు అంజనేయులు, సంతోష్‌రెడ్డి, ఆనంద్, స్వామి తదితరులు పాల్గొన్నారు.


నంగునూరు రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావురావు పక్కనే ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి

హామీలు విస్మరించిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

● నంగునూరు రోడ్‌షోలో మాజీమంత్రి హరీశ్‌రావు

నంగునూరు, మే 1: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి నంగునూరులో నిర్వహించిన రోడ్ షోలో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తో కలిసి మాట్లాడారు. విద్యావంతుడైన మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డిని గెలిపిస్తే మన ప్రాంతాన్ని అభివృద్ధి చేయించేలా కృషి చేస్తాడని చెప్పారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా మండల కేంద్రంలో రోడ్ షోకు తరలి వెళ్తున్న ఆటో నర్మెట్ట శివారులో బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. నర్మెట్ట గ్రామానికి చెందిన నార్లపురం కృష్ణవేణి, బోదాసు రాజవ్వ, బోదాసు భానుకు గాయాలయ్యాయి. వారిని వెంటనే నంగునూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం కోసం పార్టీ సిద్దిపేట లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రేవంత్ మాటలు నమ్మి మోసపోవద్దు


మామిడాల గ్రామంలో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

ములుగు, మే 1: సీఎం రేవంత్‌రెడ్డి మాయ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ములుగు మండలం మామిడాల గ్రామంలో మార్కెట్‌కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కోడూరు బూపాల్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి, కేంద్రంలో రాముని పేరు చెప్పి రాజకీయాలు చేస్తున్న బీజేపీని నమ్మొద్దన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్వాసితుల ప్యాకేజీలు రావడం కోసం నిరాహార దీక్ష చేయడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించుకోవాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందన్నారు. ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షుడు జహంగీర్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ.. ఒకరు మృతి


మృతి చెందిన కుంభదేవ్

రాయపోల్, మే 1: కారు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన రాయపోల్ మండలం కిష్టాసాగర్ వద్ద చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా రాజబొల్లారం గ్రామానికి చెందిన కోట బాబుశేఖర్ తన భార్యా పిల్లలతో కలిసి బుధవారం మధ్యాహ్నం రాయపోల్ నుంచి కారులో తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో మండలంలోని కృష్ణసాగర్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న బైక్, కారు ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరిలో వెనక ఉన్న కుంభదేవ్(35) ఎగిరి కిందపడగా, తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కీసర మండలం బండ్లగూడకు చెందినవాడు. కాగా ద్విచక్ర ద్విచక్ర వాహనం అతివేగంగా రాంగ్‌రూట్లో వచ్చి కారును ఢీకొనడంవల్లే ప్రమాదం చోటుచేసుకుందని కోట బాబుశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.

కోనాపూర్‌లో విద్యుదాఘాతంతో వ్యక్తి ..


సురేష్ దావులే (ఫైల్)

దౌల్తాబాద్, ఏప్రిల్ 1: మండలంలోని కోనాపూర్‌లో మంగళవారం రాత్రి ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనాపూర్ గ్రామానికి చెందిన షైలాగారి మల్లయ్య(65)కు ముగ్గురు కూతుళ్లు సంతానం కాగా అందరికీ పెళ్లి చేశాడు. భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందింది. దీంతో మల్లయ్య ఒక్కడే ఇంట్లో అనారోగ్యంతో బాధపడుతూ జీవిస్తున్నాడు. అదే గ్రామంలో ఉండే చిన్నకూతురు రజిత మంగళవారం రాత్రి ఎప్పటిలాగే తన తండ్రి మల్లయ్య వద్దకు వెళ్లి చూసేసరికి ఇంట్లో విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ సమాచారమందుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బుధవారం మృతుడి కూతురు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ..

సిద్దిపేట అర్బన్, మే 1: మండలం ఎన్సాన్‌పల్లి చెరువులో బుధవారం ఓ మహిళ ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినోద(45) భర్త గతంలో చనిపోవడంతో ఆమె మండలంలోని ఎన్సాన్‌పల్లిలో తల్లిగారి ఇంటివద్దే ఉంటున్నది. మానసిక అనారోగ్యంతో గుట్కా, కల్లుకు బానిసై ఇంట్లో చెప్పకుండా బయట తిరిగేది. ఈ క్రమంలో చెరువులో పడి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ భాను ప్రకాష్ తెలిపారు.

హల్దీవాగులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం


మృత దేహం

వర్గల్, మే 1: మండలంలోని నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం సమీపంలోని హల్దీ వాగులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభించినట్లు గౌరారం ఎస్ఐ శివకుమార్ తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఈ సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లగా చెక్‌డ్యాం వద్ద సుమారు 35 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం నీటిలో తేలింది. ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కుడి చేతికి ఎర్రటి దారం తప్ప ఇతర ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తించలేకపోయారు. ఎవరైనా గుర్తిస్తే గౌరారం పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పోలీస్‌స్టేషన్ నెంబర్ 8712667462, 87126673403 నెంబర్లకు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

కుటుంబ కలహాలతో బావపై బావమరిది దాడి

చేర్యాల, మే 1: కుటుంబ కలహాల నేపథ్యంలో చేర్యాల పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన గుస్క భూమయ్యపై అతడి బావమరిది మహేందర్ మంగళవారం రాత్రి దాడికి పాల్పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. తహసీల్ కార్యాలయ సిబ్బందిగా కొన్నాళ్ల క్రితం రిటైర్డ్ అయిన భూమయ్యకు అతడి భార్యకు మధ్య తగాదాలు చోటుచేసుకోగా పలుమార్లు పెద్దలు సర్దిచెప్పారు. మనస్పర్థల కారణంగా కొన్ని నెలలక్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. నెలరోజులక్రితం చేర్యాలకు వచ్చినా దంపతుల మధ్య సఖ్యత కుదరలేదు. ఇటీవల ఇంట్లో గొడవ జరిగిన విషయాన్ని ఆమె తన సోదరుడు మహేందర్‌కు తెలపడంతో మంగళవారం రాత్రి అతడు తన మిత్రుడితో కలిసి ఇంటికి వచ్చారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో మహేందర్ కర్రతో భూమయ్యపై దాడి చేసి పరారయ్యారు. భూమయ్యకు తల, కన్నుపై భాగంలో గాయమై రక్తస్రావమైంది. బాధితుడు ఆరుబయట నిద్రిస్తున్న చుట్టుపక్కల వారికి తెలపడంతో అంబులెన్సులో హుటాహుటిన చికిత్స నిమిత్తం హన్మకొండకు తరలించారు. పోలీసులు ఇంటిని పరిశీలించి చుట్టుపక్కలవారి నుంచి వివరాలను తెలుసుకున్నారు. భూమయ్య చికిత్సపొందుతున్న హన్మకొండలోని ఆస్పత్రికి సిబ్బంది చేరుకుని విచారణ చేపట్టారు.

చింతమండకలో మద్యం బాటిళ్ల పట్టివేత

సిద్దిపేట రూరల్, మే 1: మండలంలోని చింతమండక గ్రామంలో బెల్ట్‌షాపులపై పోలీసులు ఆకస్మిక దాడి చేసి సుమారు రూ.18 వేల విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. చింతమడక గ్రామంలో ఉష రాజయ్య, బయలు తిరుపతిరెడ్డిల కిరాణా షాప్‌లో మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిద్దిపేట రూరల్ పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వ రెడ్డి తెలిపారు.

గజ్వేల్‌లో సీతారామ ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

● నేడు కల్యాణోత్సవం


బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న పూజారులు

గజ్వేల్, మే 1: గజ్వేల్ పట్టణంలోని చారిత్రక శ్రీ సీతారామా, ఉమామహేశ్వర స్వామి వార్ల ఆలయ బ్రహ్మోత్సవాలను పంచాహ్నిక దీక్షలతో పూజారులు బుధవారం ప్రారంభించారు. గణపతి పూజ, వాసుదేవ పుణ్యహావాచనము, అంకురార్పణ కార్యక్రమాలను నిర్వహించి యాగశాల ప్రవేశము, ధ్వజారోహణము కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం భేరి పూజ దేవతాహ్వానమును నిర్వహించారు. గురువారం ఒకే వేదికపై శ్రీ సీతారాములు, ఉమామహేశ్వరుల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ కమిటీ పూర్తి చేశారు.

పచ్చటి ఆకుల్లో భోజనం... పర్యావరణానికి హితం


ఎన్సాన్‌పల్లిలో విస్తర్ల తయారీలో మహిళలు

సిద్దిపేట అర్బన్, మే 1: పచ్చటి ఆకులలో భోజనం చేయడం ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి కూడా హితంగా ఉంటుందని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలో మోదుగు ఆకుల ద్వారా డ్వాక్రా మహిళలచే విస్తారాకులు తయారీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణం పైన ఎలాంటి దుష్పరిమాణాలు ఉంటున్నాయో తెలియచెప్పారు. సింగల్ యూస్ ప్లాస్టిక్ వినియోగం నిషేధం, ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, ఎస్‌బీఎం చెన్నారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఏటీ బాబు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మే డే స్ఫూర్తితో హెల్త్ క్యాంప్

సిద్దిపేట టౌన్, మే 1: మే డేను పురస్కరించుకొని సిద్దిపేట పట్టణంలోని 19వ వార్డులో బుధవారం కౌన్సిలర్ గ్యాదరి రవీందర్, సిరి పిల్ల దవాఖాన ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు, వార్డులోని కార్మికుల పిల్లలకు ఉచితంగా హెల్త్ క్యాంప్ నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిరాం, ఆసుపత్రి ఎండీ ఇమ్రాన్, బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు బయ్యారం ఇస్తారి, పుట్ల దినేష్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చేర్యాల, మే 1 : చిన్నారులు, విద్యార్థులు, క్రీడాకారులలో క్రీడలపట్ల ఆసక్తి పెంపొందించేందుకు నిర్వహిస్తున్న హ్యాండ్‌బాల్ వేసవి శిక్షణశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీడీ రఫత్ ఓమర్ అన్నారు. జిల్లా క్రీడలు, యువజన శాఖ శాఖ ఆధ్వర్యంలో చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్ ఆవరణలో మే 31వతేదీ వరకు నిర్వహించతలపెట్టిన ఉచిత హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను వృథా చేయకూడదన్నారు. శిబిరంలో నాగపురి జడ్పీఎస్ఎస్ పీఈటీ విశాల పాల్గొన్నారు.